నేడు ఊబర్ షటిల్ బస్సు ప్రారంభం



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీహబ్ ప్రాంగణంలో ఊబర్ షటిల్ బస్సును సోమవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. నగరంలో తిరిగేందుకు ఊబర్ సంస్థ ఆటోలు, కార్లతో పాటు ప్రస్తుతం తాజాగా బస్సు సౌకర్యాన్ని కూడా కల్పించేందుకు ముందుకొచ్చింది.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హమీద్ పటేల్

చందానగర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్ సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ హమీద్ పటేల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12.5 లక్షల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1న హెచ్‌సీయూ స్నాతకోత్సవం



రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవాన్ని అక్టోబర్ 1న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ భాసుత్కర్ జగదీశ్వర్‌రావు పర్యవేక్షణలో చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, ఆత్మీయ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరుకానున్నారు.

అయ్యప్ప సొసైటీ ఆఫీస్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్పసొసైటీలో సొసైటీ ఆఫీస్ బిల్డింగ్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనంలో సమావేశాలు, సభలు, చిన్న ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు వీలుగా భవనం నిర్మించడంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అయ్యప్పసొసైటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ కేవీ రావు, వైస్ ప్రెసిడెంట్ డీవీ రత్నం, ట్రెజరర్ ప్రసాద్, తిరుపతిరాజు, కమిటీ మెంబర్లు భవానీ, పద్మజ, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో సినీ తారల సందడి



రాయదుర్గం: రాయదుర్గంలో ఆదివారం సినీతారలు తేజస్వీమడివాడ, ప్రియాంకచౌదరి సందడి చేశారు. వీరు ఓ ప్రైవేట్ బ్యూటీ క్లినిక్‌ను ఇక్కడ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సౌందర్యసాధనపై దృష్టిపెట్టాలన్నారు. అభిమానులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో బ్యూటీ క్లినిక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని భానుటౌన్‌షిప్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాను టౌన్‌షిప్ అధ్యక్షుడు షరీఫ్, ఉపాధ్యక్షుడు ఇలియాస్, ప్రధాన కార్యదర్శి రాంనాథ్, భీంరావు, పవన్ గౌడ్, అమర్ దీప్, అశోక్, మక్బుల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ టౌన్ ప్లానింగ్ సేవలు!

నిజాంపేట్ మున్సిపాలిటీలో ఐదారు నెలలుగా ఖాళీగానే ఏసీపీ పోస్టు

మరోవైపు ఇన్‌చార్జి టీపీఎస్ అధికారి



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం ఉందా..? లేదా..? అనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులోని ఏసీపీ పోస్టు ఐదారు నెలలుగా ఖాళీగానే ఉన్నది. దీనికి తోడూ జనగామ మున్సిపాలిటీలో టీపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతికి ప్రభుత్వం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీఎస్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆమెకు రెండు ప్రాంతాల్లో విధులు ఉండడంతో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రశాంతి నెల రోజుల పాటు సెలవులో ఉండడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి పూర్తి స్థాయిలో అధికారి లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

జనగామకు ఎక్కువ..
నిజాంపేట్‌కు తక్కువ..

ఏడాదిన్నరగా నిజాంపేట్ ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా ప్రశాంతి విధులు నిర్వర్తిస్తుంది. మొదట్లో వారానికి మూడు రోజులు జనగామ, మరో మూడు రోజులు నిజాంపేట్‌లో విధులు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం జనగామకే ఎక్కువ పరిమితమై, నిజాంపేట్‌కు వారానికి కేవలం ఒక్క రోజే వస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ అధికారి ఉన్నప్పుడు టీపీఎస్ లేకపోయిన తమ పనులు , గత ఆరు నెలల నుంచి సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారి పని ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్‌ఓసీల జారీతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లాంటి అనేక సమస్యలు ఉన్నాయి. అయితే పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసే అధికారి లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఎక్కడ చూసిన ఫుట్ పాత్‌ల ఆక్రమణే..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనాభాతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రోడ్ల వెంట ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్‌లో ఎక్కడ చూసినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోయాయి. వీటిని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా వి ఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల వెంట ఉండే చిరు వ్యాపారులకు ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు సదుపాయా లు కలిస్తామని అధికారులు హామీనిచ్చా రు. కానీ ఇప్పటి వరకు అది అమలుకు నోచుకోలేదు.

ఆఫీస్‌లో ఉండరు.. ఫోన్ లేపరు..

రెండు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న టీపీఎస్ ప్రశాంతి ఎప్పుడూ ఆఫీసులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొన్నది. కనీసం కాల్ చేసి తెలుసుకుందామంటే ఫోన్ ఎత్తడం లేదని, కింది స్థాయి సిబ్బందిని అడిగితే వారికి పూర్తి స్థాయిలో సమాచారం ఉండదని బాధితులు వాపోతున్నారు.

వినికిడి సమస్యలపై అవగాహన



విద్యార్థులకు దంత పరీక్షలు చేసి బిస్కెట్లు అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

చందానగర్ : చందనగర్‌లోని న్యూ గుడ్ షెఫర్డ్స్ చెవిటి మూగ పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చెవిటి అవగాహన వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వినికిడి లోపం పుట్టుకతో లేదా ఎప్పుడైనా రావచ్చన్నారు. పరీక్షలో కనీసం 25 డేసీబుల్స్ వినకుంటే వినికిడి లోపంగా నిర్ధారిస్తారన్నారు. ఐక్యరాజ్యసమితి వారు ఈ లాంగ్వేజ్‌కి గుర్తింపు తెచ్చేందుకు ఈ వారాన్ని సైన్ లాంగ్వేజెస్ వారోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. బధిరులు ఉపయోగించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం చందానగర్‌లోని స్మిత దంత వైద్యశాల డాక్టర్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్టులు, బ్రష్‌లు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మెర్సీ, ఉపాధ్యాయురాలు శోభ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నండూరి వెంకటేశ్వరరాజు, జనార్దన్, అమ్మయ్య చౌదరి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతంలో జీర్ణ సంబంధిత రుగ్మతలు అధికం



కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు

మాదాపూర్: దక్షిణ భారతదేశంలో రోజురోజుకూ జీర్ణ సంబంధిత రుగ్మతలు గణనీయంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. మాదాపూర్‌లోని యశోద దవాఖానలో బ్రిడ్జ్ ది గ్యాప్స్ 2.0 నేషనల్ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీర్ణ సంబంధిత రుగ్మతలు, కాలేయ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రతి ఐదుగురు పెద్దల్లో ఒకరు వీటి బారిన పడుతున్నారన్నారు. యేటా మరణాల శాతం కూడా 3.17శాతానికి చేరుకుందన్నారు. సమావేశంలో తీవ్రమైన జీర్ణశయాంతర రక్తస్రావం, పేగు అడ్డంకులు, తీవ్రమైన పేగు అడ్డంకులు, కాలేయ వైఫల్యం, ప్యాంక్రియాటైటీస్, ఫ్యాటీలివర్, వైరల్ హైపటైటీస్, సిర్రోసిస్, లివర్ ఫెల్యూర్ వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 500లకు పైగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు, డాక్టర్లు నవీన్ పోలవరపు, సంతోష్ ఎనగంటి, కె.ఎస్ సోమశేఖర్ రావు, గోపి శ్రీకాంత్, శరత్‌చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

85 శాతం రైతులకు అంతంతమాత్రంగానే భూమి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్ర నిపుణుడు ప్రొఫెసర్ నర్సింహారెడ్డి

చందానగర్ : దేశంలో 85 శాతం చిన్న రైతులు, వ్యవసాయ కూలీలకు తక్కువ భూమి ఉందని ప్రముఖ వ్యవసాయ శాస్త్ర నిపుణుడు ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి అధ్యయన కేంద్రంలో 'భారతదేశంలో సమకాలీన వ్యవసాయ పరిస్థితి–సమస్యలు, పరిష్కారాలు–వ్యవసాయ ఆర్థిక విశ్లేషణ' అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. సారంపల్లి మల్లారెడ్డి, డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ సోమమర్లతో కలిసి హాజరై మాట్లాడారు. రైతు ఆత్మహత్యలకు కారణం పంటలకు న్యాయంగా రావాల్సిన ఆదాయం దక్కకపోవడమేనన్నారు. రైతులకు అనుకూలంగా ఉండి రుణ, మార్కెటింగ్, పరిశోధనా విధానాలను రూపొందించాలన్నారు. రైతాంగం ఐక్యంగా కార్పొరేట్లకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధరలపై పోరాడాలన్నారు. ఈ సదస్సు కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలతో ఒక మెమోరాండం రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలన్నారు. 60 శాతం గ్రామీణ జనాభాకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అతి తక్కువగా ఉంటూ అవి క్రమంగా తగ్గుతూ పోతున్నాయన్నారు. పత్తి సాగును తగ్గించి వాటి స్థానంలో నీరు, పెట్టుబడులను తక్కువగా వినియోగించే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు సాగు పంటల విధానం అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకురాలు ఝాన్సీ, డాక్టర్ అరిబండి ప్రసాదరావు, నైనాని గోవర్ధన్, రామకృష్ణారెడ్డి, ప్రభు లింగం, డాక్టర్ సురేశ్ బాబు, వ్యవసాయ ఆర్థికవేత్తలు, రైతు సంఘాల నాయకులు, మహిళలు, యువకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీవాసులకు ఆదివారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఒక మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత



పటాన్‌చెరు టౌన్: ఆపద సమయంలో నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన శివయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో రూ.3 లక్షల ఎల్ఓసీని శివయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం : సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు అన్నారు. రాయదుర్గంలో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యూత్ అసోసియేషన్లు కూడా ముందుకు రావడం హర్షణీయమన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అలాగే అపోలో ఆస్పత్రుల వైద్యులు స్థానికులను పరీక్షించి మందులు అందించారు. కార్య క్రమంలో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింగరావు, నాయకులు భరత్‌గౌడ్, రాములు గౌడ్, కృష్ణయాదవ్, సురేశ్‌గౌడ్, సత్యజిత్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, అరవింద్‌గౌడ్, అనంతరామ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, సయ్యద్‌చాంద్, సుధీర్, కార్తీక్, సంఘమేష్, గోపాల్ పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

'గచ్చిబౌలి టు వరంగల్'కు ఏసీ బస్సులు

నేటి నుంచి అందుబాటులోకి



రాయదుర్గం: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గచ్చిబౌలి నుంచి వరంగల్‌కు ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ప్రతి సోమ, శుక్రవారాల్లో హన్మకొండ బస్‌స్టేషన్ నుంచి గచ్చిబౌలికి 8277, గచ్చిబౌలి నుంచి హన్మకొండకు 8278 నంబర్ గల బస్సులను కేటాయించారు. ఈ నంబర్ల ఆధారంగా ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి రిజర్వేషన్ చేసుకునే అవకాశం కూడా కల్పించారు. టికెట్ ధర రూ.450గా ఖరారు చేశారు. ప్రతి సోమవారం ఉదయం 5 గంటలకు, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హన్మకొండ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ మీదుగా గచ్చిబౌలికి చేరుకుంటుంది. అదేవిధంగా గచ్చిబౌలి నుంచి సోమవారం ఉదయం 10.30 గంటలకు, శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొండాపూర్ ఏడీఈ కమలాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీరాంనగర్ ఏ బ్లాక్, శ్రీరాంనగర్ బీ బ్లాక్ పార్ట్, ఏఎంబీ మాల్ బ్యాక్ సైడ్, కొత్తగూడ విలేజ్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుపాద టౌన్‌షిప్, మసీద్‌బండ, లక్షర్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. రూ. టమాట 60, పచ్చిమిర్చి 35, బెండ 50, కాకర 40, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికం 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

పరామర్శ



చందానగర్ : ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆదినారాయణ కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ హఫీజ్‌పేట్ వినాయకనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. జీహెచ్‌ఎంసీ లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, నాయకులు యాదగిరి గౌడ్, నరేందర్ గౌడ్, సౌందర్య రాజన్, మూర్తి, కనకారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్ యాజమాన్యం జరుపుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను బంద్ చేయించినట్లు తెలిపారు. కాలనీలో పలు రోడ్లు మూసివేశారని వాపోయారు. విద్యుత్‌నగర్‌కాలనీ నుంచి బెల్ సీఐఎస్‌ఎఫ్ క్వాటర్స్ వైపు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రని చెప్పారు. త్వరలో బెల్ యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్ లచ్చిరాం నాయక్, నాయకులు బాలాజీ, రాజు, రవీందర్, కాలనీ అధ్యక్షుడు అజీం, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కాలనీ అసోసియేషన్‌లు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి. రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.బాబూరావు, జనరల్ సెక్రటరీ ఎం.యాదిరెడ్డి, జాయింట్ సెక్రటరీ సీహెచ్. వెంకట్రామరెడ్డి, ట్రెజరర్ టి. మదన్‌మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వెంకట్‌రావు, జోనల్ ఎగ్జిక్యూటివ్‌లు కెవిఎస్ఆర్ చౌదరి, కె.బసవ లింగయ్య, బి.శంకర్‌రావు, ప్రకాష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

హైడ్రా ముందస్తు చర్యలు



సాక్షి, సిటీ బ్యూరో: కొండాపూర్ ఆర్డీవో ఆఫీస్ పరిసరాల్లో వర్షపు నీరు నిలిచి పోకుండా హైడ్రా సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టింది. అలాగే మాదాపూర్, సైబర్ టవర్స్, శిల్పారామం ఎదురుగా కూడా నీరు నిల్వకుండా పనులు చేపట్టారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరికి చెందిన కళాకారులు సుమప్రభ శిష్య బృందం చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అంబాకామాక్షి, ఉమామహేశ్వరీ వర్ణం, కాళీకౌత్వం అంశాలను సుమప్రభ, భార్గవి, పూజ, సింధు, హర్షిత ప్రదర్శించారు. మీరా నాట్య నిలయం శిష్యబృందంతో భరతనాట్య నృత్యంలో భాగంగా మూషికవాహన, అష్టలక్ష్మి, నోటుస్వర, త్రిశు అలరిపు, రంగపూజ నృత్య, మహాలక్ష్మి అష్టకం, స్వరజతి, గణేశ పంచరత్న, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు వార్షిత, మనస్వి, భవిష్య, రాజనందిని, నిహిత, తనస్వి తదితరులు పాల్గొన్నారు.